# కానిస్టేబుల్ కనకయ్య




నైట్ డ్యూటీ చేసి పీక్కు పోయిన ముఖంతో ఇల్లు చేరుకున్నాడు కానిస్టేబుల్ కనకయ్య.

ఇంట్లో అడుగు పెట్టాడో లేదో, "మా నాన్నగారు వచ్చారండి" అన్నది భార్య కాంతమ్మ అత్యంత ఆనందోత్సాహంతో.

ఆ వార్తకు కనకయ్య గుండెల్లో గునపం దిగినట్లైంది. కొన్ని క్షణాలు అతడి నోటి నుండి మాటలులేవు. పోలీసు డిపార్టుమెంటులో వుద్యోగమవటంవల్ల పుచ్చుకోవడమే గాని ఎన్నడూ ఇవ్వడం ఎరుగడు అతిథులు వచ్చినా, అప్పులు వచ్చినా కబుర్లతో ముంచెత్తి మంచి నీళ్లతోనే సరిపెట్టడం అతనికి పరిపాటి కాంతమ్మ మనస్తత్వం అందుకు పూర్తిగా భిన్నం. అతిథుల్ని ఆదరించి సత్కరించాలన్నది ఆమె అభిమతం ఈ విషయంలో ఆ భార్యా భర్తల మధ్య ఎప్పుడూ గొడవే

అతడి పరిస్థితి చూసి, 'అదేమిటండీ అలా అయిపోయారు? అంది కాంతమ్మ

ఆ మాటలకు తేరుకుని, 'అబ్బే ఏంలేదు అంటూ పెదిమలు విరిచాడు.

"రాత్రి డ్యూటీ గదా అల్లుడుగారు అలసి పోయినట్లున్నారు. తొందరగా కాఫీ పట్టుకు రామ్మా" మంచం వాల్చారు మామగారు.

మంచం మీద చతికిల పడ్డాడే గాని ముళ్ల మీద కూర్చున్నట్లుంది కనకయ్యకి

"అదేనోయ్ తాలూకా ఆఫీసు పని మీద వారం రోజులు ఇక్కడుండవలసి వచ్చింది ఊళ్లో అమ్మాయి, అల్లుడూ వుండగా మరో చోట వుండడం బావుండదని ."

మామగారి మాటలకు కనకయ్య గుండెల మీద పిడుగు పడ్డట్లయింది. ఒక రోజు కాదు. రెండ్రోజులు కాదు . వారం... అంటే ఏడు రోజులు పీడబ్బగారిల్లు అనుకున్నాడో ఏమిటో, అతగాడి కూతుర్ని చేసుకున్నందుకు తన కిది శిక్షలా వుంది. తనకు పంతక్క కొత్త సైకిలు కొంటానని చెప్పి ఐదేళ్లయింది ఇంతవరకూ అంచుల్లేవు. పైగా... ఇలా ఆలోచిస్తూ వుండిపోయిన భర్తకు కాఫీ అందించింది కాంతమ్మ.

వేడి వేడి కాఫీ గొంతుక దిగేసరికి కాస్త కోలుకుని సభ్యత కోసం లేని చిరునవ్వును బలవంతంగా తెచ్చుకుంటూ పలకరించాడు.

ఈ మాట ఆ మాట అయ్యేక భార్య ప్రక్కకు పిలిచి, "రాక రాక ఇన్నాళ్లకు, నాన్నగారు మనింటికొచ్చారు. పచ్చడి మెతుకులతో సరిపెడితే. బావుండదు. బజారుకెళ్లి కూరలు పట్టుకురండి" సంచీ చేతికిచ్చింది.

కూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్నఈ రోజుల్లో రోజూ కూరలంటే తన పని ఖాళీయే. మామగార్ని తిరిగి పంపే మార్గం కనుచూపు మేరలో కానరాక పోవడంతో అయిష్టంగానే సంచీ పుచ్చుకుని సైకిలు బయటకు తీసాడు కనకయ్య.

"నాకు మాత్రం ఇక్కడ వొక్కడికీ ఏంతోచి చస్తుంది... పద.. నేనూ వస్తాను." అంటూ అతడిని అనుసరించారు మామగారు.